www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 నవంబర్ 2022



వేగంగా కట్టమంచి చెరువు సుందరీకరణ పనులు

నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కట్టమంచి చెరువు శుభ్రత, సుందరీకరణ పనులను వేగంగా పూర్తిచేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కమిషనర్ కట్టమంచి చెరువు, మార్కెట్ యార్డ్ ప్రాంతాలను పరిశీలించారు. కట్టమంచి చెరువుకట్ట, పరిసర ప్రాంతాలను పూర్తిగా శుభ్రం చేయించాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. పిచ్చిమొక్కలను తొలగించాలని, కట్టను ఆహ్లాదకరంగా మార్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ యార్డు ప్రాంతంలోని కాలువను పరిశీలించారు. సమస్య పరిష్కారంపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించారు. ఎంఈ ధనలక్ష్మి, డీఈలు రమణ, వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.

అన్ని పథకాల్లో జిల్లా ముందంజ

- డిసెంబర్ 21న సామూహిక గృహప్రవేశాలు
- పేదలందరికీ ఇల్లు పురోగతిపై నియోజకవర్గాల్లో సమీక్షలు
- జెడ్పి సర్వసభ్య సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను ప్రభుత్వం మారుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు రాష్ట్రఎక్సైజ్ శాఖామాత్యులు కె.నారాయణస్వామి పేర్కొన్నారు. శనివారం ఉదయం ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం చిత్తూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు మందిరమైన డాక్టర్ వైఎస్ఆర్ సభావేదిక నందు జడ్పీఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన 5వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసర్వసభ్య సమావేశమునకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనులు, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖామాత్యులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డప్ప, జిల్లా జాయింట్‌కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు, సత్యవేడు ఎంఎల్ఏలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ్, ఎంఎస్.బాబు, ఆదిమూలం, ఎంఎల్‌సిలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, భరత్, జడ్పీ వైస్‌చైర్మన్ రమ్య, ధనుంజయరెడ్డి, రాష్ట్ర పాలఏకిర కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్‌లతో పాటు జెడ్పి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకష్ణ, డీఆర్డీఏ, డ్వామా పీడీలు చంద్రశేఖర్, తులసి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన వివిధ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపిపిలు, కోజెడిపి కోఆప్టేడ్ సభ్యులు పాల్గొన్నారు.



జెడ్పి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నామని తెలిపారు. పాఠశాలల విలీనప్రక్రియ వలన మిగులుగా ఉన్న అదనపు తరగతి గదులను అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు వినియోగించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ... జిల్లాను అన్ని పథకాల అమలులో ముందంజలో ఉంచాలని, ఇందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. డిసెంబర్ 21న సామూహిక గహప్రవేశాల కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలన్నారు. అలాగే జిల్లాలో గహనిర్మాణాల పురోగతికి సంబంధించి నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులు సమీక్షలు నిర్వహించి పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నదని, ఈ కార్యక్రమ పర్యవేక్షణా భాద్యత తల్లదండ్రుల కమిటీ, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం వైద్యరంగం లో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తూ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కూడా ప్రారంభించిందని, వైద్యసేవలను ప్రజలకు సత్వరమే అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కషి చేయాలని సూచించారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

అదనపు తరగతి గదులు నిర్మించండి
ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం

జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశంలో విద్యాశాఖ అజెండా చర్చ సందర్భంగా ఎంఎల్‌సి విఠపుబాలసుబ్రహ్మణ్యం మాట్లా డుతూ తన సర్వీసులో విద్యకు ఇంతటి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను అభివద్ధి చేస్తున్న నాడు-నేడు కార్యక్రమం అద్భుతమని, గతంలో తాను ఎంఎల్‌సిగా ఉన్న సమయంలో పాఠశాలల మరమ్మతుల నిమిత్తం కోరేవారని ప్రస్తుతం పూర్తిగా ఆ పరిస్థితి మారిందన్నారు. విద్యకు ఇంతటి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ నాడు- నేడు కింద ఎక్కువ సంఖ్యలో అదనపు తరగతిగదులు మంజూరైన పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు ఈ పనుల నిర్వహణలో ఇంజినీరింగ్ సిబ్బంది సహకారాన్ని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనితో పాటు పిల్లలకు రాగి జావ అందించేందుకు చర్యలు



జెడ్పి సర్వసభ్య సమావేశం తీర్మాణాలు ఇవే...

1. జిల్లా పరిషత్ నిధులతో పలమనేరు, కుప్పం, వి.కోట, కుప్పం, చిత్తూరు, మదనపల్లె, హార్సిలీహిల్స్‌లో జెడ్పి అతిథిగహాల నిర్మాణం
2. ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా 15వ ఆర్థిక సంఘం నిధులలో ఒక కోటి రూపాయలు కేటాయింపు
3. జిల్లాపరిషత్ కార్యాలయం నిర్మించి 100సంవత్సరాల పైబడినందున అవసరమైన భవనాల మరమ్మత్తులు, పునర్నిర్మాణం గావించుటకు ఆమోదం
4. చిత్తూరులో శిథిలావస్థకు చేరుకున్న జిల్లా పరిషత్ అతిథి గహాన్ని నిర్మించుటకు ఆమోదం
5. జిల్లా పరిషత్ చైర్మన్ వాహనం కండిషన్‌లో లేనందున నూతన వాహనం కొనుగోలుకు ఆమోదం.

అంతా రహస్యమే..!

జెడ్‌పి తీరుపై విమర్శలు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ప్రజాదృష్టి

అక్కడ ప్రజలకు సంబంధించిన ఎన్నోసమస్యలు ప్రస్తావనకొస్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో జనం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల ముందు ఉంచి వాటిని చర్చించేందుకు, తద్వారా ఆసమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ఈ వేదికలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని విలేకరులు పత్రికల్లో రాస్తూ ఉంటారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మునుపెన్నడూ లేని విధంగా ఈ సమావేశాలకు మీడియాను పూర్తిగా బాయ్‌కాట్ చేస్తోంది. సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డినే స్వయాన ఆదేశించారు. దీంతో అధికారులు కూడా ఇదే అదునుగా పత్రికా విలేకరులను అనుమతించడం లేదు. దీనివల్ల జిల్లాలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు మీడియా దృష్టికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఇది ఒకవిధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని ప్రముకులు చెబుతున్నారు. మీడియా ఉంటే సభలో ఏం జరుగుతుంతో ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించేందుకు వీలుంది. పత్రికల్లో రావడం వల్ల అధికారుల నిర్లక్ష్య ధోరణి కూడా ప్రజలకు తెలుస్తుంది. దీనివల్ల వారు ఇబ్బంది పడుతారు. ప్రజల సమస్యలను తొందరగా పరిష్కరించేందుకు వీలౌవుతుంది. అయితే ఇప్పుడు మీడియా గొంతు నొక్కేయడం వల్ల ప్రజాసమస్యలు తెలీకుండా పోతున్నాయి. అంతే కాకుండా విలేకరులు లేకపోవడం వల్ల ఇక్కడ జరుగుతున్న తంతును తెలిపే అవకాశం లేకుండా పోతోంది. జిల్లా పరిషత్ సమావేశాన్ని వైసిపి తన పార్టీ కార్యక్రమంలాగా నిర్వహిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాధారణంగా ఈ సభలోకి జెడిపిటిసిలు, ఎంపిపిలు, ఎంపి, ఎంఎల్ఎలు సంబంధిత అధికారులకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇతరులు ఎవరూ ఇందులోకి వచ్చేందుకు వీల్లేదు. పార్టీకి చెందిన నాయకులు అందరూ వచ్చి కూర్చుంటున్నారు. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అవకాశం లేకపోయినా, వారు మంత్రుల దృష్టిలో పడేందుకు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. అయితే పత్రికా విలేకరులకు అనుమతి లేకపోవడం వల్ల ఈ విషయాలను బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేకుండా పోతోంది. అంతేకాకుండా ప్రజల ఇబ్బందులను ప్రస్తావించడం వల్ల ఇవి పత్రికల్లోకి వస్తే తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతో హాజరు కానివ్వడం లేదు. ఈసమావేశానికి పత్రికా విలేకరులు తప్ప ఎవరైనా వచ్చి కూర్చోవచ్చు. అనే పద్ధతిలో తయారైంది.

'పేదలందరికీ ఇళ్లు'

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : మేయర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'నవరత్నాలు పేదలందరికీ ఇల్లు' పథకాన్ని సద్వినియోగం చేసుకొని సొంత ఇంటి కలలు నెరవేర్చుకోవాలని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. శనివారం మేయర్ నగరపాలక సంస్థ పరిధిలోని బండపల్లి, దొడ్డిపల్లి జగనన్న హౌసింగ్ కాలనీ లేఅవుట్లలలో పర్యటించారు. లేఅవుట్లలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో చర్చించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి వీలైనంత ఎక్కువ మంది ఇల్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. లేఔట్లలో ఇల్లు నిర్మాణం చేపట్టిన వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. లేఔట్లలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఇల్లు నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేయడంతో పాటు, పక్క గహాలు మంజూరు చేసినట్లు వివరించారు. సకాలంలో ఇల్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీల్లో ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నగర మేయర్ అముద

64 సర్క్యులర్ రద్దు అయ్యేంతవరకు పోరాడాలి

వీఓఏల జిల్లా సమావేశంలో సిఐటియు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ 64ను రద్దు చేసుకునేంత వరకు వీఓఏలు ఐక్యంగా పోరాటం చేయాలని శనివారం జరిగిన జిల్లా సమావేశంలో సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షులు జైను రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు సంవత్సరాల కాలపరిమితి పెడుతూ సర్క్యులర్64 విడుదల చేయడం దుర్మార్గమని అన్నారు. గత 20సంవత్సరాలుగా పనిచేస్తున్నవారిని మూడు సంవత్సరాల కాలపరిమితి పేరుతో ఇళ్లకు పంపడం దారుణమన్నారు. గతంలో ఎలాంటి వేతనం లేకుండా పనిచేస్తున్న వీవోఏలకు రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో అనేక రకాల పోరాటాలు చేసిన ఫలితంగా ప్రస్తుతం రూ.8వేలు ఇస్తున్నారని ప్రస్తుతం అది కూడా లేకుండా ఇంటికి పంపే కార్యక్రమాన్ని చేయడం సిగ్గుచేటు అన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమపథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందవేస్తున్న వీరిపై పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. 64 సర్క్యులర్ రద్దయ్యేంతవరకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని తీవ్రంగా ఖండించారు. కోటి మంది మహిళలకు సేవలు అందిస్తున్న వివోఏలపై వేధింపులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చేసిన పోరాటాలు వల్లనే ప్రస్తుతం వీరి ఉపాధి కొనసాగుతున్నదని భవిష్యత్తులో కూడా పోరాటాలతోనే ఉపాధిన కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మండలాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని వాటిని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు సురేంద్రన్, సంఘం జిల్లాకార్యదర్శి నాగరాజు, కోశాధికారి వసంత, నాయకులు శ్రీధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు

మామిడి పరిశ్రమలకు చేయూత

ఆహార సంబంధిత పరిశ్రమలను మరిన్ని నెలకొల్పాలి : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో అనేక పరిశ్రమలను తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తుందని చిత్తూరు జిల్లాలో పలు రహదారులు విస్తరణ పనులు జరుగుతున్నందున మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర అటవీ పర్యావరణ విద్యుత్, మైనింగ్‌శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు అన్నారు. శనివారం పట్టణంలో మామిడిగుజ్జు పరిశ్రమల యజమానులకు, రైతులకు, ఇతర కొనుగోలుదారులకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు ఆధునిక లాబరేటరీలను నేడు వారు ప్రారంభించారు. శనివారం ఉదయం కట్టమంచి బాలకష్ణరెడ్డి మామిడి భవనంను ప్రారంభించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర అటవీపర్యావరణ, విద్యుత్, మైనింగ్‌శాఖ మాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు అనంతరం లేబరేటరీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని పలు రహదారులు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నందున మరిన్ని వచ్చే అవకాశం ఉందని రైతులకు, పరిశ్రమలకు ఉపయోగపడేలా ఆధునిక లాబరేటరీ కార్యాలయాలను ఏర్పాటు చేసినందుకు జిల్లా మామిడి పల్ప్, పండ్ల పరిశ్రమ యజమానులను ఆయన అభినందించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, రైతులు విత్తనాలు కొనుగోలు నుంచి పండించిన పంటను అమ్ముకునేంతవరకు సహకరించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాలలో అందుతున్న సేవలు గురించి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి అధికారులు రావడమే కాక ఇతర దేశాలకు చెందిన పలువురు వచ్చి అధ్యయనం చేసి తమ దేశాలలో కూడా ఇటువంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావించడం జరుగుతుందని దీనిని బట్టి వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత సహకరిస్తుందో తెలుసుకోవాలని అన్నారు. అదేవిధంగా చిత్తూరు జిల్లాలో మామిడి అభివద్ధికి కట్టమంచి బాలకష్ణారెడ్డి చేసిన సేవలు అభినందనీయమని జిల్లా వ్యాప్తంగా పలు పరిశ్రమలు ఏర్పాటుచేసి ఎగుమతులను చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని ఇటీవల ముఖ్యమంత్రి మరియు గవర్నర్ లు ఆయనకు వైయస్సార్ అచీవ్మెంట్ అవార్డు ప్రకటించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకతి వైపరీత్యాల కోసం 3వేల కోట్ల నిధులను ఏర్పాటు చేసి పంటలు నష్టపోకుండా ఈక్రాప్ బుకింగ్, ఈకేవైసీలను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పండ్ల పరిశ్రమ యజమానులకు కొనుగోలుదారులకు సంబంధించి ఒక కార్యాలయం మంచి వాతావరణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా నంద్యాల పార్లమెంటు సభ్యులు అపెడ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన పంటలలో మామిడి ముఖ్యమైనదని చిత్తూరు జిల్లాలో ఈ పరిశ్రమ అభివద్ధికి వాతావరణంతో పాటు శ్రమలు కేంద్రీకతకం కావడం ఆనందకరమని రానున్నకాలంలో మరిన్ని ప్రోత్సాహకాలు అందుకొని పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు.



కట్టమంచి బాలకృష్ణారెడ్డి భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

అదేవిధంగా ఎగుమతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించిన పార్లమెంటు సభ్యులు రెడ్డప్ప, బ్రహ్మానందరెడ్డి, పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిలు రెడ్డప్ప, బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, జడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు శ్రీనివాసులు ఎంఎస్ బాబు, రాష్ట్ర ఆర్‌టిసి వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విదేశీ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, చిత్తూరు మేయర్ ఆముద, చూడ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

నాడు- నేడులో జిల్లా ప్రధమస్థానం: మంత్రి పెద్దిరెడ్డి

నాడు- నేడు కార్యక్రమం అమలులో రాష్ట్రంలో మన జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఇదేస్థాయిని కొనసాగించేలా జిల్లా యంత్రాంగం కషి చేస్తుందని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనులు, అటవీ, పర్యావరణ, శాస్త్రసాంకేతికశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జెడ్పి సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు 5 సర్వసభ్య సమావేశాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజాసమస్యలను జిల్లాలోని ఎంపిపిలు, జెడ్పిటిసిలు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు ఈ సర్వసభ్య సమావేశం ద్వారా ప్రభుత్వం దష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈసమస్యలను వచ్చే సమావేశం లోపు పరిష్కరించవలసినదిగా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గడపగడపకు వైఎస్ఆర్ ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారని, ఈ కార్యక్రమం ద్వారా స్థానికంగా అవసరమైన మంచి నీరు సరఫరా, సిసి రోడ్డుల నిర్మాణం వంటి మౌళిక వసతులలో గల పలుసమస్యలకు పరిష్కారం లభిస్తున్నదని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అవసరమైన చోట్ల సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి వసతులు వంటి పలు మౌళిక వసతులను దాదాపుగా ఏర్పాటు చేసుకున్నామని, మిగిలిన వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి సచివాలయానికి మంజూరు చేసిన రూ.20లక్షలలో పూర్తి చేసుకోవచ్చునని తెలిపారు.

ఘనంగా 'పివికెఎన్' గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక పివికెఎన్ ప్రభుత్వ కళాశాల మొదటి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి ఉపకులాధిపతి రాజారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల విద్యా కమిషనర్ ఓలా భాస్కర్ గౌరవఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సర్‌ల ఆచార్య రాజారెడ్డి ప్రసంగిస్తూ జాతీయభావం దేశభక్తి విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ విద్యావిదానానికి అనుగుణంగా ప్రస్తుతం విద్యాసంస్థలు ఉన్నత స్థానంలో నడుస్తున్నాయన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల అభివద్ధిని చూస్తుంటే పూర్వ విద్యార్థిగా గర్వంగా ఉందని కొనియాడారు. విద్యార్థులందరూ దేశాన్ని అగ్రగామిగా మార్చేందుకు చిత్తశుద్ధితో కషిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేషన్ పొందిన విద్యార్థులను అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కళాశాల కమిషనర్ ఓలా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు కఠినమైన సవాళ్లను ఎదుర్కోవడానికి వెనకడుగు వేయద్దని సూచించారు. బలమైన వ్యక్తిత్వంతో ముందుకు సాగాలన్నారు. పివికేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో అత్యున్నత ప్రమాణాలతో విద్యానిందిస్తున్న కళాశాల పివికేన్ అని పేర్కొన్నారు. విద్య పరిశోధన పరిశీలనాపరంగా పివికేన్ ప్రభుత్వ కళాశాల అభివద్ధి పథంలో నడుస్తోందని ఆయన వెల్లడించారు. అనంతరం వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ గ్రాడ్యుయేషన్ డే లో డిగ్రీలను ప్రధానం చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీలలో టాపర్గా నిలిచిన విద్యార్థులకు బంగారు పథకాలు అందజేశారు. అన్ని విభాగాల్లో టాపర్గా నిలిచిన విద్యార్థులకు కూడా ఎండోమెంట్ బహుమతులను అందజేశారు. ఆచార్య ఓంకార్, ఆర్జెడి నాగలింగారెడ్డి, ఎస్వి యూనివర్సిటీ రెక్టార్ శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్టర్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ఆచార్య విజయభాస్కరరావు, సేతురామన్, శాస్త్రవేత్త ఆనంద్, వెంకటరత్నం, మధుసూదన్ రావు కళాశాల చైర్మన్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజిఎస్‌లో వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యత

రాష్ట్ర ఉపాధిహామీ సంచాలకులు చిన్న తాతయ్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహాత్మా గాంధీ ఉపాధిహామీ పనులలో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టే పనులలో ప్రధానంగా వ్యవసాయ ఆధారిత పనులు ఉండాలని, వ్యవసాయానికి పనికి వచ్చే పనులను సకాలంలో పూర్తిచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని రాష్ట్ర ఉపాధి హామీ సంచాలకులు చిన్న తాతయ్య అన్నారు. చిత్తూరులో శనివారం సాయంత్రం డ్వామా కార్యాలయంలో చిత్తూరు డ్వామా పిడి చంద్రశేఖర్‌తో కలసి జిల్లాస్థాయిలో జరుగుతున్న వివిధ అభివద్ధి కార్యక్రమాలపై మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా విజిలెన్స్ విభాగం ద్వారా అమలు అవుతున్న సోషల్ ఆడిట్, రికవరీలు, విచారణలు, రెవెన్యూ రికవరీ యాక్ట్, కోర్టు విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఆడిట్ చేపట్టిన 16 విడుతల కార్యక్రమానికి సంబంధించి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీలకు హాజరవుతున్న పరిస్థితి అదేవిధంగా యాప్ పనితీరు జరిగిన పనులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 31మండలాల్లో యాప్ ద్వారా అప్లోడ్ చేయాల్సిన కార్యక్రమాలను వారం లోపల పూర్తి చేయాలన్నారు. అలాగే అకౌంట్స్ వ్యాలిడేషన్ కార్యక్రమాన్ని ఆధార్ సీడింగ్ కార్యక్రమాలు ఈనెల 30 లోపల పూర్తి చేయాలని ఆదేశించడంతో పాటు ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు రూ.250లు గిట్టుబాటు ధర తప్పనిసరిగా వచ్చేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాభవాణి, ఉమావాణి ఇతర ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.



మండల అధికార్లతో ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తున్న చిన్నతాతయ్య.

గ్రామాలలో శాశ్వత భూహక్కు.. భూరక్ష...

జిల్లాలో 95 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ : జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లకు సంబంధించి భూహక్కును కల్పించేందుకు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకమని జిల్లా పంచాయతీ అధికారి టి.లక్ష్మి అన్నారు. శనివారం నాడు డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో గ్రామాలలో రీసర్వే నిర్వహిస్తున్న గ్రామసర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఓలకు శిక్షణాకార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు డ్రోన్‌సర్వే పూర్తి అయిన గ్రామాలలో 95 గ్రామాలకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమం వేగంగా జరుగుతోందని గ్రామాలలో గ్రామ కంటాలు, ప్రభుత్వ భూములు గుర్తించడం జరుగుతుందని అనంతరం వ్యక్తులకు సంబంధించిన భూముల సరిహద్దులను గుర్తించి వారు అనుభవంలో ఉన్న భూములకు భూహక్కును కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. చిత్తూరు జిల్లాలో జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశాల మేరకు రీసర్వే కార్యక్రమం వేగంగా జరుగుతోందని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఈకార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందని డిపిఓ తెలిపారు. 9,2 నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఏవైనా అభ్యంతరాలు ఉంటే మండల మేజిస్ట్రేట్‌గా నియమించబడ్డ డీటీలకు తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చునని అనంతరం ఫైనల్ ఆర్ఓఆర్ ఇచ్చిన తర్వాత భూహక్కు పత్రాలను యజమానులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

విత్తనశుద్ధితో దిగుబడులు సాధ్యం

ప్రజాశక్తి -పులిచెర్ల: విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని సూచించారు. పులిచెర్ల మండలం మతుకువారిపల్లి ఆర్బీకేలో శనివారం రైతు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనశుద్ధి అనంతరం పంటల సాగుకు సమాయత్తం కావాలని.. మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనాలను సేకరించాలన్నారు. రైతులు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. రబీలో ఆరుతడి పంటలను వేయాలని, వేరుశనగ, ఉద్దులు, పెసలు, అలసందలు వంటి వాటిని వేసుకోవాలని తెలిపారు. వరిలో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మూడు పంచాయతీలలో ఏనుగుల దాడి

- రూ.15 లక్షల మేర పంట నష్టం
- వ్యవసాయం చేయలేమంటున్న రైతులు
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి-సోమల
మండలంలోని మూడు పంచాయతీలలో ఏనుగుల మంద పంట పొలాలపై దాడులు చేయడంతో రూ.15 లక్షల మేర పంట నష్టం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా మండలంలోనే పూర్తిగా మకాం వేసి రాత్రి వేళల్లో ఏనుగులు పంట పొలాల పై దాడులు చేయడం నిత్యకృత్యమైపోయింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం ఏనుగుల మంద మూడు గుంపులుగా విడిపోయి బోన మంద, ఆవులపల్లి, పత్రపల్లి, 81 చిన్న ఉప్పరపల్లి ప్రాంతాలలో వరి, టమోటా, బీన్స్ పంటలపై దాడి చేసి ఎకరాల పరిధిలో పంటలను తొక్కి వేసి బిందు సేద్యం పరికరాలు, పైపులు, బోరు, బోరు మోటర్లు పూర్తిగా ధ్వంసం చేసినట్టు రైతులు ఆరోపిస్తున్నారు. బోన మంద గ్రామానికి చెందిన చిన్నబ్బ, నరసింహులు, సుందరమ్మ, రామయ్య, గుర్రప్ప, వెంకటమ్మ రైతులకు చెందిన వరిపైరులను ధ్వంసం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన కృష్ణయ్య ఒకటిన్నర ఎకరంలో నాటిన వరి పైరు పూర్తిగా ధ్వంసం చేసినట్టు రైతులు తెలిపారు. ఆవులపల్లి పంచాయతీ పత్రపల్లికి చెందిన ఈశ్వర రెడ్డి, రఘుపతి రెడ్డి రైతులకు చెందిన వరి, టమోటా, బీన్స్, బోరు, డ్రిప్ పైపులు, పరికరాలను ధ్వంసం చేయగా నాలుగు లక్షల మేర నష్టం కలిగిందని రైతులు తెలిపారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా, వరి పంటలు

ఏళ్ల తరబడి ఏనుగుల మంద కారణంగా రైతులు పంటలను నష్టపోవడం జరుగుతూ ఉంది. ఇప్పటికే పలువురు రైతులు వ్యవసాయం పూర్తిగా మానివేసి పంట పొలాలను బీడు భూములుగా వదిలివేశారు. ఏనుగులు వచ్చి పంటలను ధ్వంసం చేశాయని తెలియగానే సంఘటనా స్థలానికి వెళ్లడం చూసి రావడం తప్ప ఏనుగుల భారీ నుండి శాశ్వత పరిష్కారాన్ని అటవీ శాఖ వారు చూపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఏనుగుల భారీ నుండి రైతులను, పంట పొలాలను పూర్తిగా కాపాడి వారికి జరిగిన నష్టానికి పరిహారం అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

పాడిరైతుల అభివృద్ధికి సంగం డెయిరీ భరోసా



ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: పాడిరైతుల అభివద్ధికి సంగం డెయిరీ భరోసా కల్పిస్తోందని.. డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని క్షీరసముద్రం పంచాయతీ గిడ్డమాకరాజపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సంగం డెయిరీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల కోసం డెయిరీ యాజమాన్యం పనిచేస్తుందన్నారు. లాభాలను రైతులకు బోనస్ రూపంలో రూ.30 కోట్ల వరకు చెల్లించడం జరిగిందని.. చిత్తూరు జిల్లాలో 11వ కేంద్రాన్ని క్షీరసముద్రం గ్రామంలో ఏర్పాటు చేయడం శుభపరిణామమని గతంలో ఏ డెయిరీ ఇవ్వని ధర సంగం డెయిరీ రైతులకు అందిస్తోందని తెలిపారు. అనంతరం పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించండి

ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్



ప్రజాశక్తి -వికోట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రమైన వికోటలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను వారు శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై శుక్రవారం పాఠశాలలో ఉడకని భోజనాన్ని విద్యార్థులు పారవేశారాన్న సంఘటనపై ఆరా తీశారు. గతంలో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజనం పథక ఏజెన్సీ వారు పిల్లలు ఇష్టపడే విధంగా గోరుముద్దను తయారు చేసి పెట్టడంలో కొన్ని లోపాలు ఉన్నాయని జెడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు పాఠశాలను ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేయగా విద్యార్థులు వారి దృష్టికి తీసుకొచ్చారని తెలిసింది. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులను మార్చమని ఆదేశించగా పిల్లలకు అన్యాయం జరగకుండా కొత్త ఏజెన్సీను నియమించుకున్నారు. వారు శుక్రవారం మూడు పాత్రలలో అన్నం వండగా అందులో ఒక పాత్రలో కొంత భాగం సరిగ్గా ఉడకలేదని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందంతో దీనికి గల కారణాలను చర్చించారు. ఇకపై ఏమాత్రం అలసత్వం లేకుండా రోజువారి వంతుగా ఇద్దరు ఉపాధ్యాయులను కొంతసేపు వంట వండే విధానాన్ని పరిశీలించి తగువిధంగా సలహాలు అందజేసి జగనన్న గోరుముద్దను పిల్లల ఇష్టపడి తినే విధంగా జాగ్రత్త పడాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వీరి వెంట ఎంఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది'


అంగన్వాడి కేంద్రం అదనపు భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీఠ వేస్తుందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మండల పరిధిలోనే కొల్లాగుంట గ్రామంలో శనివారం సర్పంచ్ దివ్య ఆధ్వర్యంలో అగన్వాడీ అదనపు భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.3లక్షలతో నిర్మాణం చేసిన వంట గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రేదలకు మెరుగైన విద్యం అందించి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం మహా యజ్ఞనంలో నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలను కూడా నాడు-నేడు పథకంతో పూర్వ వైభవం తీసుకురావడానికి రూ.16 లక్షలు నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఎల్ కేజీ నుంచి ఉన్నత విద్య వరకూ ఆంగ్లంలోనే బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఆంగ్ల మాద్యంపై పట్టు సాధించేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం కొల్లాగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంగ్ల బోధన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులు చెప్పిన సమాదానాలకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఆంగన్వాడీ పిల్లలతో ముచ్చటించి వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, అంగన్వాడీ కార్యకర్త వళ్లెమ్మ, సుబ్రమణ్యం, కార్యదర్శి కేశవులు, గాంధీ, ధన్రాజ్ పలువురు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప పాదయాత్రకు నేటికి ఐదేళ్లు

ప్రజాశక్తి -పలమనేరు : జననేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పేదల జీవితాలు మెరుగుపడేలా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి తోడ్పడిన పాదయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ వ్యక్తిగత కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలమనేరు పట్టణంలోని డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పిస్తారని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్దనున్న వైయస్సార్ విగ్రహం వద్దకు ఉదయం 9 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్, మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు,కో ఆప్షన్ నెంబర్లు, రాష్ట్ర, జిల్లా, మండల,పంచాయతీ, వార్డు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, మైనారిటీ, మహిళా, అభిమానులు, యువజన విభాగాలు అనుబంధ విభాగాలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

రాజ్యాంగ చట్టాలపై విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి - వికోట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మండల తహశీల్దార్ సీతారాం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సలహా కోఆర్డినేటర్ కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత విద్యార్థులకు భారత రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల అవగాహనతో పాటు గౌరవభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. భారత రాజ్యాంగంలోని హక్కులు, విధుల పట్ల సరైన దృక్పథం కలిగి ఉండి ఇతరుల స్వేచ్ఛ స్వతంత్రాలకు భంగం కలగకుండా అనుభవించే స్వేచ్ఛను కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత అభివృద్ధికి ఎవరైనా ఆటంకాలు కలుగజేస్తే చట్టాలను ఆశ్రయించాలన్నారు. కోర్టుల్లో ఉచిత న్యాయ సేవలు పౌరులకు అందుబాటులో ఉన్నాయనే విషయాలు న్యాయాధికారులు తెలియజేశారు. న్యాయవాదులు సౌజన్య, అన్నపూర్ణ యువరాజ్‌తో పాటు డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, ఎంఈవో చంద్రశేఖర్, వీఆర్వో వెంకట్రావు, కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వాహనాల వేలం

ప్రజాశక్తి-గంగవరం:
అక్రమంగా మద్యం తరలిస్తున్న ద్విచక్ర వాహనాలు, ఇతర కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈనెల 7వ తేదీన గంగవరం పోలీస్ స్టేషన్‌లో వేలం నిర్వహించను న్నట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు. 7 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ కారు పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ముందుగా ధరావతు చెల్లించాలని కోరారు.



దేవళంపేటలో వైద్యసేవలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: బొమ్మయ్యపల్లి పరిధిలోని దేవళంపేట ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం గోవిందయ్య ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. వైద్యులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎల్ ద్రాక్షాయణి, ఏఎన్ఎం ధనలక్ష్మి, నాయకులు నాగరాజు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జెట్టి కథానాయకుడికి సన్మానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జెట్టి సినిమా కథానాయకుడు మన్యం మురళీకృష్ణను శనివారం బంగారుపాళ్యంలోని నాలుగు రోడ్ల కూడలిలో టీడీపీ మండలాధ్యక్షులు జయప్రకాష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరెన్నో తెలుగు చిత్రాలను నిర్మించాలని.. గ్రామీణ ప్రాంత వాసుల జీవన విధానాలకు అనుగుణంగా నూతన చిత్రాలు నిర్మించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అభిమానులు హేమచంద్రనాయుడు, జనార్ధన్ గౌడ్, రాజేంద్రనాయుడు, అరవిందో లోకనాథంనాయుడు, గిరిబాబు, శివ తదితరులు పాల్గొన్నారు


వైయస్సార్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

వైఎస్ఆర్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి : మండలంలోని సిబిఎన్ కాలనీలో అంగన్వాడి సెంటర్‌ను హెల్త్ ఎడ్యుకేటర్ పి.సావిత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, ఆ కేంద్రంలోని పిల్లల తల్లులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అంతరం డాక్టర్ వైయస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్ నిర్మల, ఏఎన్ఎం లక్ష్మి, ఆషా మోబినా హాజరయ్యారు.

పట్టుబడ్డ వాహనాలు వేలం

సీఐ చంద్రశేఖర్

ప్రజాశక్తి - పలమనేరు : జిల్లా ఎస్పీ రేశాంత్ రెడ్డి ఆదేశాలమేరకు పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో మద్యం కేసులో పట్టుబడ్డ ఒక ఆటో ఐదు ద్విచక్రవాహనాలను సోమవారం బహిరంగ వేలం పాటను పలమనేరు డిఎస్పీ గంగయ్య ఆధర్యంలో చేపట్టనున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. కావున వేలం పాటలో పాల్గొన్న వారు ముందుగా వారి పేర్లను పోలీస్‌స్టేషన్లో నమోదు చేసుకోవాలన్నారు.

బెంగళూరు నాయుడుకు ప్రముఖుల నివాళి



ప్రజాశక్తి-గంగాధనెల్లూరు: మండలంలోని అక్కదేవతలకండిగ గ్రామానికి చెందిన బాలక్రిష్ణమనాయుడు అలియాస్ బెంగుళూరు నాయుడు శుక్రవారం బెంగుళూరు సిటీ మల్లీశ్వరంలో మరణించిన విషయం తెలిసిందే. శనివారం ఆయన భౌతిక కాయానికి కర్ణాటక మాజీ స్పీకర్ రమేష్ కుమార్, పలువురు మాజీ మంత్రులు కేజే జార్జ్, రోషన్ బేగ్ నివాళులు అర్పించారు.

పోలీసుస్టేషన్ తనిఖీ



ప్రజాశక్తి-గంగాధనెల్లూరు: గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం డిఎస్పీ సుధాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీ లించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలీసు శాఖకు సంబంధించి రికార్డులను వార్షిక తనిఖీల్లో భాగంగా గంగాధరనెల్లూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎస్ఐ శ్రీనివాసరావు వద్ద పలు రికార్డులను గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్య గారి పల్లి గ్రామ పంచాయతీలోగల ఫజులుపేటకు చెందిన కె.గురుమూర్తి(57) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు గురుమూర్తి శుక్ర వారం రాత్రి రొంపిచెర్ల నుండి క్రాస్ వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందారు.

చోరీ నగదు స్వాధీనం- నిందితుడి అరెస్టు



ప్రజాశక్తి-సోమల: సదుం మండలం గురికానివారిపల్లె గ్రామంలో గత నెల 29వ తేదీ జ్యోతుల చిన్నప్ప అనే వ్యక్తి ఇంట్లో రూ.2 లక్షల నగదు చోరీ జరిగినట్టు సదుం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శనివారం తాటిగుంటపాలెం సమీపంలో విశ్వనాధ్(31) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి రూ.లక్ష 50 వేల నగదు స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరు పరిచినట్లు చౌడేపల్లి రూరల్ సీఐ మధుసూదన రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌నంటూ విశ్వనాథ్ గ్రామంలో పరిచయాలు పెంచుకొని జ్యోతుల చిన్నప్ప వద్ద నాటుకోడిని కొని అతను ఇంటిలోకి వెళ్లి బీరువాలో డబ్బు దాచి పెడుతుండగా గమనించి ఎవరూ లేని సమయంలో బీరువాను పగలగొట్టి అందులోని రూ.2 లక్షలను చోరీ చేసి పరారయ్యాడు. పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. చోరీ చేసిన డబ్బులు రూ.50 వేలు జల్సాలకు ఖర్చు చేశాడని సీఐ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో అపరిచిత వ్యక్తుల పట్ల ప్రభుత్వ ఉద్యోగులమంటూ పరిచయాలు చేసుకునే కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వా లని కోరారు. సమావేశంలో ఎస్ఐ మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ లింగాపురం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమైన సంఘటన జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం గ్రామానికి చెందిన రాజగోపాల్ ఇంటిలో గ్యాస్ సిలిండర్ నుండీ గ్యాస్ లీకై వాసన రావటంతో ఇంట్లోని వారూ బయటికి పరుగులు తీసారు. ఇంతలోపే మంటలు చెలరేగడంతో ఇంటిలోని సామగ్రి కాలిపోయింది. ఈ ఘటనతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఇంటిలో ఉన్న వంట సామగ్రి, చిరుధాన్యాలు నగదు రూ.50 వేలు మంటలకు ఆహుతైంది. బందర్లపల్లి సర్పంచ్ రాజగోపాల్, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి భరోసా కల్పించారు. ప్రభుత్వం ద్వారా నూతన ఇల్లుకు మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. అగ్నిమాపక అధికారులు గ్రామాల్లో గ్యాస్ సిలిండర్ల వాడకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరారు.

ఆనందరెడ్డికి టీడీపీ, వైసీపీ నేతల నివాళి



ప్రజాశక్తి-గంగాధనెల్లూరు: మండలంలోని మోతరంగనపల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నేత మురళీశ్వర్ రెడ్డికి తండ్రి ఆనందరెడ్డికి గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ శుక్రవారం రాత్రి మరణించారు. శనివారం ఆయన భౌతిక కాయానికి పలువురు టీడీపీ నేతలు, చిట్టి బాబు నాయుడు, పాచిగుంటమనోహర్ నాయుడు, స్వామి దాస్, శ్రీధర్ యాదవ్, క్రిష్ణ మనాయుడు, దేవ సుందరం, నియాజాలీ, జీవరత్నం, అశోక్ నాయుడు, దేవరాజులు, మోహన్ నాయుడు, కోదండ రెడ్డి, నారాయణ రెడ్డి, జాన్, బుజ్జి బాబు, పట్టాబి, జయప్రకాష్, గోపి, వైసీపీ కి చెందిన మాజీ సీడీసీఎంఎస్ ఛైర్మన్ వేల్కూరుబాబు రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధసూదన్ రెడ్డి, వేల్కూరు మాజీ సర్పంచ్ రాధారెడ్డి, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, వేర్వేరుగా నివాళులు అర్పించారు.

డీఈఈ కౌన్సిలింగ్ ప్రారంభం



ప్రజాశక్తి-కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో డీఈఈ సెట్ కౌన్సిలింగ్ శనివారం ప్రారంభ మైదని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం పురుషోత్తం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటిలో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి విద్యాశాఖ రెండవ కౌన్సిలింగ్ విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తోందని కళాశాల అనుమతి కాపీని డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించామని పేర్కొన్నారు. మొదటి రోజు ఐదుగురికి మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావడంతో వారి ధృవపత్రాలను పరిశీలించామని అన్నారు. మీసేవ ద్వారా కళాశాల ఫీజు చెల్లించిన అభ్యర్థులకు కళాశాల ప్రవేశపత్రాన్ని అందించామన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరై అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఒరిజినల్‌తో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృపావతి, అధ్యాపకులు, దేవప్రసాద్, ఇళంగోవన్, పనజ పలువురు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - యాదమరి: చిన్నారులకు.. గర్భిణులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెరుమాలపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. మాతాశిశుమరణాలను నిర్మూలించేందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా కార్యకర్త వినాయకి, అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణులకు అందుబాటులో బస్సు సర్వీసులు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: గ్రామీణులకు అందుబాటులో బస్సు సర్వీసులు ఉండేలా డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మూడు మండలాల సరిహద్దులలో నూతన బస్సు సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం చిత్తూరు-2 డిపో అధికారులు ఆధ్వర్యంలో బస్సును నడిపారు. చిత్తూరు- తిరుపతి వయా కొత్తపల్లిమిట్ట, మంగుంట, ఆళ్ళమడుగు, శ్రీనివాసపురం, దిగువ పల్లాలు, జాండ్లపేట, సోమేంద్రపురం, మాకమంబాపురం, చవటగుంట, తిరుపతి మార్గంలో ఆర్టీసీ సిబ్బంది బస్సు నడిపేందుకు చర్యలు చేపట్టారు. దీంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, జిల్లా జనరల్ సెక్రెటరీ కామసాని పద్మనాభరెడ్డికి ప్రజలు కతజ్ఞతలు తెలిపారు.

ఎన్జీవో అధ్యక్షుడిగా రహమత్ అలీఖాన్



ప్రజాశక్తి-పుంగనూరు: ఏపీ ఎన్జీవో పుంగనూరు సంఘ అధ్యక్షుడిగా రహమత్ అలీఖాన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక బసవరాజు జూనియర్ కళాశాల ఆవరణలో నియోజకవర్గ ఎన్జీవో సంఘ ఎన్నికలను పలమనేరు తాలూకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు ఆనందబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా రహమత్ అలీ ఖాన్, కార్యదర్శిగా సురేష్‌రాజు, కోశాధికారిగా రఘురామయ్య, సహ ఉపాధ్యక్షులుగా డి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా మురళీ, బాబు, వర సుబ్రహ్మణ్యం, మహేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా వెంకటమునీ, దాము, మురళీకృష్ణారెడ్డి, మహిళా సంయుక్త కార్యదర్శిగా పుణ్యవతిలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఎన్జీవో సంఘ అధ్యక్షుడు రహమత్ అలీఖాన్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు కతజ్ఞతలు తెలిపారు. అందరి సహాయ సహకారాలతో సంఘం అభివృద్ధికి కషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి పరుగుపందెం పోటీల్లో..

కల్లూరు విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-పులిచెర్ల: రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీల్లో కల్లూరు విద్యార్థులు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచి జిల్లాకు పేరు, ప్రతిష్ఠలు తీసుకొచ్చినట్లు సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డి అష్రఫ్ తెలిపారు. ఆంధ్ర అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు కృష్ణయ్య ఆధ్వర్యంలో హర్యానాలో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగుపందెం పోటీల్లో జిల్లా తరఫున హర్షద్, ఆశాం ఇల్లాహ్ పాల్గొని విజేతలుగా నిలిచారు. దీంతో కల్లూరులో సర్పంచ్ షుకూర్ ఆధ్వర్యంలో శనివారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా షుకూర్, రెడ్డి బాబుల్లా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో బాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శరీరదారుఢ్యం పెంపొందించు కోవచ్చునన్నారు. క్రీడాకారులకు చేయూత అందించడంలో ముందుంటామని తెలిపారు.

క్రీడల్లో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-రొంపిచెర్ల: ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి తెలిపారు. ఆమె శనివారం విద్యార్థులను అభినందించారు. కబడ్డీ పోటీలలో 9వ తరగతి చదువుతున్న అతియా జోనల్ స్థాయి క్రీడా పోటీలలో ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అండర్ -14 లెవల్ హైజంప్ పోటీలలో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. అండర్ -17 లెవల్ నియోజకవర్గస్థాయి హైజంప్ పోటీలలో సింధుప్రియ మొదటి బహుమతి, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు త్వరలో చిత్తూరులో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు.

కనీసం ఒక మర్రి మొక్కను పెంచండి



ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిరెడ్డి దేవేంద్ర, ఉపాధ్యాయులు పలమనేరు సమీపంలో గల ఒక గుట్టమీద శనివారం మర్రి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ జీవితకాలంలో కనీసం మర్రి మొక్క లాంటి పెద్ద వృక్షాలను నాటాలని కోరారు. మర్రి, రావి, చింత మొక్కలను గత రెండు మూడు తరాలు వారు నాటడం మరిచిపోయారు. కాబట్టి అందరూ కనీసం ఒక మహా వృక్షాన్ని తమ జీవిత కాలంలో పెంచాలనే సంకల్పంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోదండ రామిరెడ్డి, కిరణ్ కుమార్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న ఆర్డీఓ

తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ

ప్రజాశక్తి-సోమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని పలమనేరు ఆర్డీఓ రామకృష్ణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం, స్పందన అర్జీలపై వెంటనే చర్యలు చేపట్టడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం, ధ్రువపత్రాలను సకాలంలో అందజేయడంలో సిబ్బంది చొరవ చూపాలని కోరారు. తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.